క్లుప్తంగా

వాహనాల తనిఖీ

వెంకటాపురం(కె): మండల కేంద్రంలో ప్రొబిషనరి ఎస్సై తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించకుండా ద్విచక్రవాహనాలు నడిపే వారికి జరిమానా విధించారు. మండల కేంద్రాని వచ్చి వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అనుమానిత వ్యక్తులు ఎవరైన కనిపిస్తే వారి వద్ద నుంచి పూర్తి స్థాయి సమాచారాన్ని సేకరించి పంపిస్తున్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉంటాం..



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

వాజేడు: మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని మండల పరిధిలోని ధర్మవరం ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఉపాధ్యాయులు శుక్రవారం ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం పోరాటం చేస్తున్న ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామవుతామన్నారు. డ్రగ్స్ వాడినా, సరఫరా చేసిన కొనుగోలు చేసిన పోలీసులకు సమాచారం ఇస్తామని విద్యార్థులు ప్రకటించారు.

కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడి సస్పెన్షన్

మంగపేట: ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేసిన బుచ్చంపేట కాంగ్రెస్ పార్టీ గ్రామకమిటీ అధ్యక్షుడిని పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీకి, మంత్రి సీతక్కకు చెడ్డ పేరు తీసుకువచ్చే విధంగా వ్యవహరిస్తే వారు ఎలాంటి వారైనా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఒకరికి జైలు

కన్నాయిగూడెం: మండలంలోని బుట్టాయిగూడెంలో 2022 నవంబర్‌లో తల్లి పోషణ విషయంలో గొడవ పడి అన్నను కొట్టడంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి అన్న చనిపోయిన ఘటనలో తమ్ముడికి మూడు నెలల జైలు శిక్ష రూ.5 వేల జరిమానా పడినట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. బుట్టాయిగూడెంకు చెందిన వృద్ధురాలు కుమ్మరి మల్లక్క పోషణ విషయంలో అన్నదమ్ములు కుమ్మరి దుర్గయ్య, కుమ్మరి చిన్నవెంకటయ్య మధ్య గొడవ తీవ్ర స్థాయికి చేరింది. దీంతో తమ్ముడు కుమ్మరి చిన్నవెంకటయ్య, అన్న కుమ్మరి దుర్గయ్యను కర్రతో కొట్టాడు. ఈ క్రమంలో మనస్థాపానికి చెందిన దుర్గయ్య పురుగుల మందు మృతి చెందాడు. దుర్గయ్య భార్య మాణిక్యం ఫిర్యాదు మేరకు చిన్న వెంకటయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా జైలు శిక్ష పడింది.

ఆర్థిక సాయం



సరుకులు అందజేస్తున్న గ్రామస్తులు

మంగపేట: మండల కేంద్రం పరిధిలోని పొదుమూరుకు చెందిన బద్ది పాపారావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో బాధిత కటుంబాన్ని శ్రీ రామకృష్ణ సేవా ట్రస్టు చైర్మన్ బాడిష నాగరమేశ్ 50 కేజీల బియ్యం, రూ.4,000 నగదును ఆర్థిక సాయంగా పంపించగా గ్రామస్తులు శుక్రవారం అందజేశారు. మాణుపెల్లి వేణు, కలాల రాంబాబు, రోహిత్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

ములుగు రూరల్: మండలంలోని బందారుపల్లికి చెందిన కొక్కర్ల ఐలయ్య, దొమ్మటి రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బానోత్ రవిచందర్ శుక్రవారం పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. నల్లెల్ల భరత్‌కుమార్, నాగరాజు, మావురపు తిరుపతిరెడ్డి, రామన్న, వీరస్వామి, రాకేష్, మల్లయ్య తదితరులు ఉన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

ములుగు రూరల్: అనారోగ్య కారణంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మల్లంపల్లి మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మల్లంపల్లి గ్రామానికి చెందిన రాకం మోహన్ రావు(60) అనారోగ్య కారణంతో గురువారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగు మందుతాగాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతిడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వరావు తెలిపారు.

వాన జాడేది?



విత్తనాలు చల్లుతున్న రైతులు

- ముఖం చాటేసిన వరుణుడు
- ఎదురుచూస్తున్న రైతులు

వెంకటాపురం(కె): వర్షాకాలం ప్రారంభమైనా జిల్లాలో ఇప్పటి వరకు భారీ వర్షం పడలేదు. మే నెలలో భారీగా వర్షాలు కురవడంతో రైతులు ఈ ఏడాది వానాకాలం సీజన్ ముందుగానే వచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు. సాగుకు సన్నదద్ధమయ్యారు. కాగా అన్నదాతలు పొలం బాట పట్టి దుక్కులు దున్నకోవడంతో పాటు కొన్ని చొట్ల నారు పోసుకున్నారు. జూన్ నెల ప్రారంభం నుంచి నేటి వరకు వర్షం పడలేదు. చిరు జల్లులు కురవటంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరుణుడి కరుణ కోసం రైతులు ఆకాశం వైపునకు ఎదురు చూపులు చూస్తున్నారు. వానాకాలం సీజన్ ప్రారంభమై 20 రోజులు దాటుతున్నా చినుకు జాడలేదు. వేసవిలో దంచి కొట్టిన వానలు వర్షాకాలంలో ముఖం చాటేశాయి. ప్రస్తుతం వర్షం పడటమే అలస్యమన్నట్లుగా విత్తనాలు వేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు.

సమయం మించి పోతోంది



వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో దుక్కులు దున్నుకొని సిద్ధం చేశాం. వర్షం కురుస్తే విత్తనం విత్తుకునేందకు సిద్ధంగా ఉన్నాం. సమయం మించి పోతున్న వరుణుడు కరునించడం లేదు.

– కొప్పుల కృష్ణ, రైతు

నారు పోసుకున్నాం..



ఈ ఏడాది ముందుగానే వర్షాలు కురవడంతో వరి నారు పోసుకున్నాం. జూన్ నెల ప్రారంభం నుంచి చినుకు జాడ లేక పోవడంతో నారు ముదురుతుందని ఆందోళన చెందుతున్నాం.

– నాగరాజు, రైతు



ట్రాక్కర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

హెల్మెట్ ధరించిన వాహనదారులకు అభినందనలు

ఎస్‌ఎస్‌తాడ్వాయి: హెల్మెట్ ధరించి ప్రయాణించిన వాహనదారులను ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి అభినందించారు. హెల్మెట్ ధరించడంపై వాహనదారులను చైతన్యవంతం చేసేందుకు తాడ్వాయి పోలీసులు వినూత్న అవగాహన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈమేరకు శుక్రవారం మండల కేంద్రంలో కాటాపూర్ క్రాస్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. హెల్మెట్ ధరించి ప్రయాణించిన ద్విచక్ర వాహనదారులను ఎస్సై శాలువాలతో సన్మానించి వాటర్ బాటిళ్లను బహుమతిగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్క ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించి ప్రయాణించాలన్నారు. అనంతరం మండలంలోని కొండపర్తిలోని ప్రభుత్వ పాఠశాలలో గ్రామంలోని యువతతో కలిసి పోలీసులు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఆవరణలోని పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా యువతకు వాలీబాల్ కిట్టు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు పూజారి రమేష్, సాంబయ్య పాల్గొన్నారు.

రుణమాఫీ లబ్ధిదారుల ఫ్లెక్సీల ఏర్పాటు



మంగపేటలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్న ఏఈఓ

మంగపేట: మండలంలోని మంగపేట, బోరునర్సాపురం గ్రామాల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన రుణమాఫీ పథకం ద్వారా లబ్ధిపొందిన రైతుల పేర్లతో కూడిన ఫ్లెక్సీలను ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏఈఓ ఆక మహేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేశారు. మంగపేట గ్రామ పంచాయతీ పరిధిలోని 157 మంది లబ్ధిదారులకు రూ.1,55,88,572, బోరునర్సాపురంలో 151 మంది రైతులకు గాను 1,41,96,024 రూపాయాల రుణమాఫీ జరగిందని మహేష్ తెలిపారు. రుణమాఫీ పొందిన రైతుల జాబితా ఫ్లెక్సీలను ప్రభుత్వ ఆదేశాల మేరకు పంచాయతీలలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. మండంలోని 25 గ్రామ పంచాయతీల పరిధిలో 3975 మంది రైతులకు గాను 36,43,10,275 రూపాయాల రుణమాఫీ జరిగిందని ఆయా వివరాలతో కూడిన ఫ్లెక్సిలను ఆయా గ్రామ పంచాయతీలలో ప్రదర్శించనున్నట్లు ఏఓ చేరాలు తెలిపారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- రాష్ట్ర గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్



మాట్లాడుతున్న సురేందర్

ఏటూరునాగారం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను బీజేపీ నాయకులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గండపల్లి సత్యం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథి హాజరై మాట్లాడారు. సంక్షేమ పాలన.. మోదీ పాలన అని అన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా 11 సంవత్సరాల పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్రంలో బీజేపీ ప్రవేశపెట్టిన పథకాలు భారతదేశ అభివృద్ధికి చేసిన కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లి కరపత్రాలు ద్వారా ప్రజలకు వివరించాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడ చూసినా నరేంద్ర మోదీ పథకాలను మాత్రమే స్థానిక మంత్రి సీతక్క శంకుస్థాపనల పేరుతో కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి గిరిజన జిల్లా అధ్యక్షుడు గండేపల్లి సత్యం, సీనియర్ నాయకులు ఎర్రల్ల ఎల్లయ్య, మండల అధ్యక్షుడు వినుకొల్లు చక్రవర్తి, మండల ప్రధాన కార్యదర్శి కందడి ఎలేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు యానాల చంద్రారెడ్డి, ఆటిక నాగేశ్వరరావు, దుర్గం దుర్గారావు, మండల కార్యదర్శులు నరాల రవి, ఎట్టి లక్ష్మయ్య, కందకట్ల రమేష్, దుర్గం శ్రావణ్, లొట్టపిట్ట అజిత్, అల్లి నగేష్, ఇర్సవడ్ల జగన్, మల్లేశ్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలి

- గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రవిచందర్



భూమి పూజలో పాల్గొన్న రవిచందర్

ములుగు రూరల్: ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు త్వరితగతిన నిర్మించుకోవాలని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బానోత్ రవిచందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని బండారుపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇళ్లను నిర్మించుకోవాలన్నారు. అర్హులైన లబ్ధిదారులకు దశలవారిగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అవుతాయని ఇళ్లు రాని వారు నిరాశ చెందవద్దన్నారు.

పాఠశాలలో సౌకర్యాల కల్పనకు కృషి

- ఏస్వేర్ సంస్థ ప్రతినిధి శ్రీలక్ష్మి



మాట్లాడుతున్న శ్రీలక్ష్మి

ఎస్‌ఎస్‌తాడ్వాయి: పాఠశాలలోని విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తామని ఏస్వేర్ సంస్థ ప్రతినిధి శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఇందిరానగర్‌లోని జెడ్పీ పాఠశాలలో ఇన్‌చార్జ్ ఎంఈఓ రేగ కేశవరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత విద్యఅభ్యసించి ఈ ప్రాంత అభివృద్ధి కృషి చేయాలన్నారు. విద్యార్థులకు కావాల్సిన అన్ని వసతి సౌకర్యాలను అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మేడారం జాతర చైర్మన్ అరెం లచ్చుపటేల్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పాక సాంబయ్య, ఉపాధ్యాయులు శంకర్, రజిత, లక్ష్మయ్య, స్వామి, వనిత, స్రవంతి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ కొట్టెం మల్లికాంభతో పాటు తదితరులు పాల్గొన్నారు.

స్కావెంజర్లకు వేతనాలు చెల్లించాలి



ఏటూరునాగారం: ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న స్కావెంజర్లు



వెంకటాపురం(కె)లో..

ఏటూరునాగారం: ప్రభుత్వ పాఠశాలలో స్కావెంజర్లుగా పనిచేస్తున్న కార్మికులకు గత ఏడాది నుంచి వేతనాలు రావడం వెంటనే వారికి చెల్లించాలని జిల్లా పరిషత్ పాఠశాలల స్కావెంజర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంఈఓ మల్లయ్యకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణ, చెట్లకు నీళ్లు పోయడం, మరుగుదొడ్లు శుభ్రం చేయడం, పరిసరాలను శుభ్రం చేస్తున్నట్లు తెలిపారు. అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు పనిచేయగా ఒక అక్టోబర్ నెల వేతనం మాత్రమే ఇచ్చారని, మిగతావి ఇవ్వదన్నారు. వేతనాలు ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ధనలక్ష్మీ, దుర్గ, నాగలక్ష్మీ, భాగ్య, కమలమ్మ పాల్గొన్నారు.

స్కావెంజర్ల సమస్యలు పరిష్కరించాలి

వెంకటాపురం(కె): స్కావెంజర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణకు స్కావెంజర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ వేతనాలు ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రమణ, వెంకటేశ్వర్లు, పోశమ్మ తదితరులు ఉన్నారు.

ఆదివాసీ చట్టాలను అమలు చేయాలి

వెంకటాపురం(కె): ఏజెన్సీలో ఆదివాసీ చట్టాలను అమలు చేయాలని గొండ్వానా సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెసా చట్టానికి లోబడి భూ భారతి చట్టాన్ని అమలు చేయాలని తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో అధికారులు గిరిజనేతరుల దరఖాస్తులను పూర్తి స్థాయిలో పరిశీలించాలని పేర్కొన్నారు. భూ భారతి చట్టంతో షెడ్యూల్ చట్టాలను అధికారులు కాలరాయవద్దని కోరారు. గిరిజనేతరుల అక్రమ పట్టాలను రద్దు చేయాలన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- కొండాయి వైద్యాధికారి ప్రణీత్‌కుమార్



వెంకటాపురం(కె): వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి సూర్య

ఏటూరునాగారం: ప్రజలు వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలని కొండాయి వైద్యాధికారి ప్రణీత్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొండాయి గ్రామంలో ఇంటింటా సర్వే నిర్వహించి జ్వర పీడితులను గుర్తించినట్లు వైద్యాధికారి తెలిపారు. 26 మందికి పరీక్షలు చేసి మందులు ఇచ్చామన్నారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడి ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ భాస్కర్‌రావు, ఆశ కార్యకర్తలు లక్ష్మీ, మల్లేశ్వరి, భాగ్యలక్ష్మీ పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): మండల పరిధిలోని మంగవాయి గ్రామంలో డ్వాక్రా సంఘం మహిళలకు కాఫెడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైద్యాధికారి సూర్య హాజరై మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. దోమలు రాకుండా దోమ తెరలను వాడాలని, ఇంటి చుట్టు పక్కలా నీరు నిల్వ ఉంటే తొలగించి శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ మండల కోఆర్డినేటర్ గొంది హనుమంతు, యానిమేటర్లు పద్మ, ఇందిరా, ఉషా, ప్రశాంత్, నరేష్ తదితరులు ఉన్నారు.

ఫీవర్ సర్వే..

మండల పరిధిలోని చొక్కాల, వీఆర్‌కేపురం, శివాపురం, తిప్పాపురం, ఆలుబాక, వీరభద్రవరం గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించారు. గ్రామాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించి డ్రై డే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందును అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు స్నేహారెడ్డి, ఆశీష్, మనోహర్, డీపీఎంఓ సత్యనారాయణ, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

గోవిందరావుపేట: మండలంలోని రంగాపూర్ పరిధి పందిరిదోన(గొత్తికోయగూడెం)లో ఎంసీహెచ్ డాక్టర్ విక్రమ్, సూపర్ వైజర్ శ్యామల ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విక్రమ్ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఆశ వర్కర్లు నాగమణి, అనిత, స్వాతి పాల్గొన్నారు.

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మండలంలోని మేడారంలో సీజనల్ వ్యాధుల నివారణపై గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది డోర్ స్టిక్కర్లను అంటించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తపై జిల్లా అధికారులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కొర్నెబెల్లి సతీశ్, సిబ్బంది పాల్గొన్నారు.



కొండాయిలో పరీక్షలు చేస్తున్న వైద్యుడు



గోవిందరావుపేట: పందిరిదోనలో..



ఎస్‌ఎస్ తాడ్వాయి: డోర్ స్టిక్కర్లు అట్టిస్తున్న సిబ్బంది

నిషేధిత కలుపు మందుల పట్టివేత



పట్టుకున్న నిషేధిత కలుపు మందులు

మొగుళ్లపల్లి: నిషేధిత కలుపు మందులు విక్రయిస్తున్నారనే సమాచారంతో వ్యవసాయ, పోలీస్ శాఖలు సంయుక్తంగా మండల కేంద్రంలో దాడులు చేసి 40 నిషేధిత కలుపు మందు బాటిళ్లను పట్టుకున్నారు. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని వినాయక ఆగ్రో ఏజెన్సీ ఫర్టిలైజర్ షాపు యజమాని ఇరుపాల రాజేశ్వరావు కొంత కాలంగా ప్రభుత్వం నిషేధించిన గ్లైపోసెట్ అనే కలుపు నివారణ మందు అమ్మకాలు చేస్తున్నాడని పక్కా సమాచారంతో దాడులు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో రూ.36 వేల విలువ చేసే నిషేధిత కలుపు నివారణ మందు లభించినట్లు వెల్లడించారు. నిషేధిత మందును అనుమానం రాకుండా ఫర్టిలైజర్ షాపులో పెట్టకుండా షాపు పక్కన ఫొటో స్టూడియోలో దాచి అధిక ధరలకు విక్రయాలు జరుపుతూ జనాలను మోసం చేస్తూన్నాడని పేర్కొన్నారు. ఆ కలుపు నివారణ మందును పెద్ద మొత్తంలో టేకుమట్ల మండల కేంద్రానికి చెందిన అంబాల పైడయ్య వద్ద కొనుగోలు చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు ఫిర్యాదు చేయగా ఆ షాపు యజమానిపై కేసు నమోదు చేసి దర్యాపు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

- ఎస్సై వెంకటేశ్



సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తున్న ఎస్సై వెంకటేశ్

కన్నాయిగూడెం: సీసీ కెమెరాలతో నేరాలను నియంత్రించవచ్చని ఎస్సై వెంకటేశ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని బుట్టాయిగూడెం గ్రామ పంచాయతీలో ప్రధాన రహదారి వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. కెమెరాల ఏర్పాటుతో నేరాలను సులువుగా చేధించవచ్చని తెలిపారు. సీసీ కెమెరాలు నేరాల నియంత్రణలో కీలకభూమిక పోషిస్తాయన్నారు. వ్యాపార సముదాయాలు ఉన్న వారు వారి షాపుల వద్ద ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం చింతగూడెం గ్రామ చివారులో ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీ చేసినట్లు ఎస్సై తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం

యువతకు క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని ఎస్సై వెంకటేశ్ తెలిపారు. మండలం కేంద్రంలో గుర్రేవుల యువతకు ఎస్సై వాలీబాల్ క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. యువత క్రీడలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సివిల్, సీఆర్పీఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనులపై కేసులు ఎత్తేయాలి



మాట్లాడుతున్న రాజుకుమార్

కన్నాయిగూడెం: గిరిజనులపై ఫారెస్టు అధికారులు నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తివేయాలని జిల్లా బీఆర్ఎస్వీ నాయకులు దుర్గం రాజుకుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏటూరునాగారం మండలంలోని రొయ్యూర్ గ్రామ శివారులో పోడు చేసుకొని ఇళ్లను ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న రైతులపై ఫారెస్టు అధికారులు దాడులు చేసి 12 మందిపై కేసులు నమోదు చేశారన్నారు. వెంటనే కేసులను ఎత్తివేయాలని సూచించారు. గత ప్రభుత్వం పోడు భూములకు పట్టాలు ఇచ్చిందన్నారు. ఈ ప్రభుత్వం పోడు రైతులపై కేసులు పెడుతుందని ఆరోపించారు. రాజేష్, మురళి పాల్గొన్నారు.

రిజర్వాయర్ మట్టి నమూనా పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు

కాటారం: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న మండలంలోని వీరాపూర్‌లోని శివశంకర్ ప్రాజెక్టు రిజర్వాయర్‌లో శుక్రవారం క్వాలిటీ కంట్రోల్, ఇరిగేషన్ అధికారులు మట్టి నమూనా పరీక్షలు నిర్వహించారు. ప్రాజెక్టు నిర్మాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నాణ్యతా ప్రమాణాల దృష్ట్య ఈ మట్టి నమూనా పరీక్షలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. రిజర్వాయర్ పనులు నాణ్యతతో కొనసాగించేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. నిర్మాణంలో పలు దశల్లో ఈ మట్టి నమూనా పరీక్షలు చేయనున్నట్లు వివరించారు.